# పదో తరగతి తెలుగు పేపర్-2 మోడల్ పేపర్

## పేపర్-2

సమయం: 2 గంటల 45 ని. మార్కులు : 40

సమయం: 2 :15 ని. పార్ట్-ఎ మార్కులు: 30

**అవగాహన ప్రతిస్పందన** 20 మార్కులు

**అ) కింది గద్యాన్ని చదివి ఖాళీలను పూరించండి.** 5 × 1= 5

శ్రీరాముని మాటలు విన్న దశరథుడు శోకభారంతో స్పృహ కోల్పోయాడు. శ్రీరాముడు తండ్రి పాదాలకు ప్రణమిల్లాడు. కైకేయి పాదాలకు నమస్కరించాడు. అంతఃపురం నుంచి బయటికి వచ్చి లక్ష్మణునితో కలసి కౌసల్యమాతను దర్శించుకున్నాడు. తన అరణ్యవాస విషయం చెప్పాడు. ఆ మాటలు వింటూనే కౌసల్య గండ్ర గొడ్డలి చేత నరికిన మద్దిచెట్టులా నేలమీద పడిపోయింది. అంతులేని ఆవేదనకు లోనైంది. వనవాసానికి వెళ్లొద్దని కౌసల్యా, లక్ష్మణులు పరిపరివిధాల శ్రీరామునికి నచ్చజెప్పచూశారు. కానీ శ్రీరాముడు తండ్రి మాటకే తలొగ్గాడు. వెళ్లక తప్పదన్నాడు. కైకేయి పట్ల తనకు ఏ మాత్రం అనాదర భావం లేదన్నాడు. తన పట్టాభిషేకం ఆగిపోవడానికి కారణం కైకేయి కాదని, విధి ప్రేరణచే అట్లా మాట్లాడించిందని పేర్కొన్నాడు.

ప్రశ్నలు:

1. లక్ష్మణునితో కలసి కౌసల్యమాతను దర్శించుకున్నది___
2. మద్ది చెట్టులా నేలకూలినది_____
3. వనవాసానికి వెళ్లొద్దని శ్రీరామునికి నచ్చచెప్పినది_____
4. కైకేయి మాటలకు కారణం _____
5. అనాదర భావం అనగా_____

**ఆ) కింది గద్యాన్ని చదివి, ఐదు ప్రశ్నలు తయారు చేయండి?** 5 × 1= 5

శాకాహారం వల్ల కలిగే ప్రయోజనాలు ఇటీవల పరిశోధనలు తేటతెల్లం చేస్తున్నాయి. మాంసాహారంతో పోలిస్తే శాకాహారమే మేలు అని తెలుపుతున్నాయి. శాకాహారం మన శరీరంలో పేరుకుపోయిన విషపదార్థాలను తొలగిస్తుంది. అందుకే శాకాహారాన్ని స్వాభావిక విషహారిణిగా చెప్పవచ్చును. శాకాహారంలో పీచు ఎక్కువగా ఉంటుంది. మాంసాహారంతో పోలిస్తే శాకాహారం చూడటానికి కూడా ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. అంతేకాకుండా మాంసాహారంతో పోలిస్తే శాకాహారం తొందరగా జీర్ణమవుతుంది. శాకాహారం ఎక్కువగా తీసుకునేవారు స్థూలకాయం బారిన పడరు. పండ్లు, ఆకుకూరలు ఎక్కువగా తినడం వల్ల శరీరానికి విటమిన్లు, ఖనిజ లవణాలతో పాటు ఆరోగ్యకరమైన కొవ్వులు అందుతాయి.

**ఇ) కింది పద్యాల్లో ఒకదానిని పూరించి, భావం రాయండి.** 1 × 5= 5

11. ఆ కంఠంబుగ........శిలోంఛప్రక్రముల్ తాపసుల్.

(లేదా)

నీ యొడిలోన ......జిగిమెండు మాతరో.

**ఈ) కింది పద్యాన్ని చదివి, ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి.** 5 × 1 = 5

మొదలు జూచినఁ గడుగొప్ప పిదప గుఱుచ,
యాదిఁ గొంచెము తర్వాత నధిక మగుచుఁ
దనరు, దినపూర్వ పరభాగ జనితమైన
ఛాయపోలిక గుజన సజ్జనుల మైత్రి.

ప్రశ్నలు:

12. ఎవరితో స్నేహం మొదట కొద్దిగా ఉండి తర్వాత అధికమగును?
13. కుజనులు, సజ్జనుల మైత్రిని కవి దేనితో పోల్చాడు?
14. కుజనులతో స్నేహం ఎలా ఉంటుంది?
15. ఈ పద్యంలో 'నీడ' అనే అర్థానిచ్చే పదం ఏది?
16. ఈ పద్యానికి ఒక శీర్షిక సూచించండి?

**వ్యక్తీకరణ-సృజనాత్మకత (సృజనాత్మకత)**

**అ) కింది ప్రశ్నల్లో ఏవైనా రెండింటికి జవాబులు రాయండి.** 2 × 5 = 10

17) అవయవదానం ఆవశ్యకత తెలియచేస్తూ పత్రికా సంపాదకుడికి లేఖ రాయండి?
18) నగరగీతం పాఠం ఆధారంగా నగరం మాట్లాడుతున్నట్లుగా ఆత్మకథ రాయండి.
19) శతక కవులను అభినందిస్తూ అభినందనా పత్రం రాయండి.

**పార్ట్-బి**

సూచనలు: సరైన సమాధానాలను ఎ/బి/సి/డి లలో ఈ ప్రశ్నా పత్రంలోనే నిర్దేశించిన బ్రాకెట్లలో రాయండి.

**భాషాంశాలు (వ్యాకరణాంశాలు)** 20 × 1/2 = 10

1. మా ఊరిలో సముద్రమంత చెరువు ఉంది. ఇందులో ఉన్న అలంకారం ( )
   ఎ) అతిశయోక్తి బి) రూపకం
   సి) యమకం డి) ఉపమ
2. రాష్ట్రోద్యమం - అనునది ఏ సంధి పదం ( )
   ఎ) సవర్ణ బి) గుణ
   సి) ఉకార డి) యణాదేశ
3. సీతారాములు అనునది ఏ సమాస పదం ( )
   ఎ) ద్వంద్వ బి) నఞ్‌తత్పురుష
   సి) షష్ఠి డి) బహువ్రీహి
4. భ, ర, న, భ, భ, ర, వ అనే గణాలు ఉన్న పద్యం ( )
   ఎ) చంపకమాల బి) శార్దూలం
   సి) మత్తేభం డి) ఉత్పలమాల
5. 11వ అక్షరం యతిమైత్రిగా ఉన్న పద్యం ( )
   ఎ) ఉత్పలమాల బి) చంపకమాల
   సి) శార్దూలం డి) మత్తేభం
6. నేను పద్యాలు చక్కగా పాడగలను. ఇది ఏ వాక్యం ( )
   ఎ) సంశ్లిష్ట బి) కర్తరి
   సి) సంయుక్త డి) ప్రత్యక్ష
7. కింది వాటిలో కర్మణివాక్యం ఏది ( )
   ఎ) రాముడు తాటకను చంపాడు
   బి) విశ్వామిత్రుడు దివ్యాస్త్రాలు ఇచ్చాడు
   సి) లక్ష్మణునిపై బాణప్రయోగం చేయబడింది
   డి) కైకేయి వరాలను కోరుకున్నది.
8. కింది వాటిలో సంభావన పూర్వపద కర్మధారయ సమాసానికి ఉదాహరణ ( )
   ఎ) రాజోత్తముడు బి) వేపచెట్టు
   సి) రామలక్ష్మణులు డి) అధర్మం
9. కింది వాటిలో భిన్నమైనది ఏది ( )
   ఎ) గజేంద్రుడు బి) దేశౌన్నత్యం
   సి) పరోపకారం డి) మహోన్నతం
10. అచ్చోట అనే పదాన్ని విడదీస్తే ఏర్పడే పదాలు ( )
   ఎ) అ, చ్చోట బి) ఆ, చోట
   సి) అ, చోట డి) ఆ, చ్చోట
11. అన్యాయం, రామబాణం అనేవి ఏ సమాస పదాలు ( )
   ఎ) నఞ్ తత్పురుష, షష్ఠి తత్పురుష
   బి) నఞ్ తత్పురుష, ద్వితీయ తత్పురుష
   సి) విశేషణ పూర్వపద, షష్ఠితత్పురుష
   డి) ద్వితీయ తత్పురుష, షష్ఠి తత్పురుష
12. కింది వాటిలో చంపకమాల పద్యపాదం ఏది ( )
   ఎ) ఆ కంఠంబుగ నిప్పు మాధుకర భిక్షాన్నంబు భక్షింపగా
   బి) ఘనుడవ్వాడగు వేడు త్యాగమయ దీక్షంబూని సర్వం సహా
   సి) నీ యొడిలోన పెంచితివి నిండుగ కోటి తెలుంగు కుర్రలన్
   డి) అనవుడు నల్ల నవ్వి కమలానన యిట్లను లెస్సగాక యో
13. 21 అక్షరాలు ప్రతిపాదంలో వచ్చే పద్యం ( )
   ఎ) మత్తేభం బి) ఉత్పలమాల
   సి) చంపకమాల డి) శార్దూలం
14. అన్య పదార్థ ప్రధానమైన సమాసం ( )
   ఎ) బహువ్రీహి బి) రూపక
   సి) షష్ఠి తత్పురుష డి) ద్విగువు
15. విషయాన్ని ఉన్నది ఉన్నట్లుగా వర్ణించే అలంకారం ( )
   ఎ) అంత్యానుప్రాస బి) స్వభావోక్తి
   సి) అతిశయోక్తి డి) ఉపమ
16. 'నగారా మోగిందా, నయాగరా దుమికిందా'-ఇందులో ఉన్న అలంకారం ఏది? ( )
   ఎ) అంత్యానుప్రాస బి) అర్థాంతరన్యాస
   సి) వృత్యానుప్రాస డి) యమకం
17. రామలక్ష్మణులు యుద్ధరంగంలో విజృంభించారు- ఈ సంయుక్త వాక్యాన్ని సామాన్య వాక్యాలుగా మారిస్తే ( )
   ఎ) రాముడు, లక్ష్మణుడు యుద్ధరంగంలో విజృంభించారు
   బి) రాముడు యుద్ధరంగంలో విజృంభించాడు. లక్ష్మణుడు యుద్ధరంగంలో విజృంభించాడు

www.sakshieducation.com

సి) రాముడు యుద్ధరంగంలో విజృంభించాడు కాబట్టి లక్ష్మణుడు విజృంభించాడు

డి) రాముడు మరియు లక్ష్మణుడు యుద్ధరంగంలో విజృంభించారు

18. కింది వాటిలో సవర్ణదీర్ఘసంధి పదం ఏది ( )

ఎ) మేనత్త బి) మహేంద్రుడు

సి) ప్రళయాగ్ని డి) అతడట్లు

19. వసంత కవితలు రాసింది. వసంత కవితలు చదివి వినిపించింది.

ఈ సామాన్య వాక్యాలను సంశ్లిష్ట వాక్యంగా మారిస్తే ( )

ఎ) వసంత కవితలు రాస్తుంది కాబట్టి చదివి వినిపించింది

బి) వసంత కవితలు రాసింది మరియు చదివి వినిపించింది

సి) వసంత కవితలు చదివి వినిపించడానికి రాసింది

డి) వసంత కవితలు రాసి, చదివి వినిపించింది.

20. హల్లుల జంట అర్థభేదంతో అవ్యవధానంగా వస్తే అది ఏ అలంకారం ( )

ఎ) ఛేకానుప్రాస బి) లాటానుప్రాస

సి) అంత్యానుప్రాస డి) వృత్త్యానుప్రాస

## సమాధానాలు

1. శ్రీరాముడు,
2. కౌసల్య
3. కౌసల్య, లక్ష్మణుడు
4. విధి ప్రేరణ
5. ఆదరణ/ ప్రేమ లేకపోవడం

*(6 నుంచి 10 ప్రశ్నలకు విద్యార్థులు సొంతంగా సమాధానాలు రాయాలి.)*

11. **పద్యం:**

ఆ కంఠంబుగ నిప్డు మాధుకర భిక్షాన్నంబు భక్షింపఁగ
లేకున్నం గడు నంగలార్చెదవు మేలే? లెస్స! శాంతుండవే!
నీకంటెన్ మతిహీనులే కటకటా! నీ వార ముష్టింపచుల్
శాకాహారులుగంధభోజులు, శిలోంఛప్రక్రముల్ తాపసుల్!

**భావం:**

గొంతుదాక తినడానికి రుచికరమైన భిక్ష దొరకలేదని ఇంతగా చిందులేస్తున్నావు కదా! ఇది నీకు మంచిదా? బాగున్నది. నిజంగా నీవు శాంత స్వభావుడవేనా? పిడికెడు వరిగింజలతో కాలం వెళ్లబుచ్చేవారు, శాకాహారంతో దుంపలతో సరిపెట్టుకునేవాళ్లు, రోళ్లవద్ద చెదిరిపడ్డ బియ్యం ఏరుకొని జీవనం సాగించే మునులు నీకంటే తెలివి తక్కువ వాళ్లా?

(లేదా)

**పద్యం:**

నీ యొడిలోన పెంచితివి నిండుగ కోటి తెలుంగు కుర్రలన్
ప్రాయము వచ్చినంతనె కృపాణములచ్చితి, యుద్ధమాడి వా
జ్రేయ భుజాబలమ్ము దరిసింప జగమ్ము నవాబుతో సవాల్
చేయమటంటి: వీ తెలుగురేగడితో జిగి మెండు మాతరో

**భావం:**

అమ్మా తెలంగాణా, కోటిమంది తెలుగు పిల్లలను నీ ఒడిలో పెంచావు, వారికి వయసు రాగానే చేతులకు కత్తులనిచ్చి, వజ్ర సమానమైన భుజపరాక్రమాలను లోకం చూసేటట్లు నిజాంరాజుతో తలపడమన్నావు. ఈ తెలుగు నేలలో ఎంత బలం ఉన్నదో కదా!

12. సజ్జనులు/మంచివారు
13. కుజనుల మైత్రి – ఉదయం నీడ
    సజ్జనుల మైత్రి – సాయం కాల నీడ
14. మొదట ఎక్కువగా ఉండి, తర్వాత తగ్గుతుంది
15. ఛాయ
16. స్నేహం/ స్నేహం రకాలు/మైత్రి...
17. <u>లేఖ</u>

చీదెళ్ళ,
తేది: 17.12.19.

గౌరవ సాక్షి సంపాదకులు గార్కి,

నమస్కారములు.

అయ్యా,

అనారోగ్యాలకు గురయ్యి, ప్రమాదాల బారినపడి అవయవాలు కోల్పోయి ఎంతోమంది నేడు మృత్యువాత పడడం మనం చూస్తున్నాం. వారికి సరైన సమయంలో, సరైన అవయవాలు దొరికితే బతికే అవకాశం ఉంటుంది. అయితే కొంతమంది అకాలమృత్యువు బారిన పడి మరణిస్తున్నారు. వారి అవయవాలు మట్టిపాలో, అగ్నిపాలో అయి వృథా అవుతున్నాయి. అలా కాకుండా అకాలమృత్యువు పాలయ్యే వారి అవయవాలు అంత్యక్రియల ముందే దానం చేస్తే ఇతరులు బతికే అవకాశం ఉంది. ఇట్టి విషయాన్ని తమరి (మన) పత్రికలో ప్రచురిస్తారని ఆశిస్తూ..

కృతజ్ఞతలతో...

ఇట్లు
తమ అభిమాన పాఠకుడు,
xxxxxxx.

చిరునామా:
సంపాదకుడు,
సాక్షి దినపత్రిక,
xxxxxxxxxx
xxxxxxxxxxxx

18. నేను నగరాన్ని. నేటి కాలంలో మనుషులంతా నాలోనే నివసించాలని కోరుకుంటున్నారు. పల్లెల్లో ఉపాధి అవకాశాలు తగ్గడంతో బతుకుదెరువు కోసం నా దగ్గరకు వస్తున్నారు. దానికి కారణం నాలో ఉన్న అనుకూల అంశాలే. ఇలా జనాభా విపరీతంగా వస్తుండటంతో నాలో జనాభాతో పాటు సమస్యలు పెరిగాయి. ప్రపంచీకరణ ప్రభావంతో నేను నా రూపురేఖలు మార్చుకొని సామాన్యుడికి అందనంత దూరం గా జరిగాను. నా నాలుగు రోడ్ల కూ డలి శబ్దాలతో, ధ్వనులతో నయాగరా జలపాత హోరును తలపిస్తుంది. కన్నతల్లి లాంటి పల్లెసీమల్ని వదిలి నా దగ్గరకు వచ్చే ప్రజలు ఉండటానికి ఇళ్లు దొరక్క ఇనుప్పెట్టె లాంటి ఇరుకు ప్రదేశంలో నివసిస్తూ ఇబ్బందుల పాలవుతుంటే నా గుండె తరుక్కుపోతుంది. నాలోని ప్రతి మనిషి ఒక పఠనీయ గ్రంథమే. నాలో ఉదయం పూట ఎక్కడ చూసిన బడికెళ్లే పిల్లలే కనబడతారు. నన్ను తలచుకోగానే అందమైన భవంతులే అనుకునేరు. ఆ పక్కనే చిన్న చిన్న పూరి గుడిసెలు సైతం ఉంటాయి సుమా. నా ప్రజలు కేవలం ధనవంతులే కాదు, మధ్యతరగతి వాళ్లుంటారు, పేదవాళ్లు కూడా ఉంటారు. ఇకపోతే అతి ముఖ్య విషయం ఏమిటంటే నా రోడ్లు ప్రమాదాలకు చిరునామాలు. జాగ్రత్త సుమా.

ఇక ఉంటాను, బై...

19. ఓ శతక కవులారా..

వందనం...అభివందనం...

సమాజశ్రేయస్సే పరమావధిగా, మానవీయ విలువలే మహోత్తమంగా ప్రజల్లో శక్తిని, భక్తిని, అనురక్తిని కలిగిస్తూ మీరు రాసిన శతక పద్యాలు నాటికీ, నేటికీ, ఏ నాటికీ అనుసరణీయాలు, ఆచరణీయాలు...సమాజంలో విలువలు పతనం అవుతున్న నేటి కాలంలో శతక పద్యాల సారాన్ని సమాజంలో విస్తరించాల్సిన అవసరం నేటి పాలకులపై ఎంతైనా ఉన్నది. ఇలా గొప్పవైన నీతివంత శతక పద్యాలు రాసిన మీరు ప్రజల హృదయాల్లో సదా చిరంజీవులు...చిరస్మరణీయులు.

ఇట్లు
మీ అభిమాని,
xxxx

## పార్ట్-బి జవాబులు

| | | | | |
|---|---|---|---|---|
| 1) ఎ | 2) బి | 3) ఎ | 4) డి | 5) బి |
| 6) డి | 7) సి | 8) బి | 9) బి | 10) బి |
| 11) ఎ | 12) డి | 13) సి | 14) ఎ | 15) బి |
| 16) ఎ | 17) బి | 18) సి | 19) డి | 20) ఎ |

www.sakshieducation.com